క్లుప్తంగా

మంత్రికి వినతి



మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ బి.పుష్ప మర్యాదపూర్వకంగా కలసి డివిజన్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అంతకుముందు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చామన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, మల్లేష్, సతీష్ పాల్గొన్నారు.

వ్యవసాయ డీలర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

సంగారెడ్డి జోన్: వ్యవసాయ డీలర్లకు దేశి శిక్షణ కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ మనోజ్ మంగళవారం జిల్లా కార్యాలయంలో ప్రారంభించారు. 80 మంది డీలర్లను రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి వారంలో ఒకరోజు 48 వారాల పాటు వ్యవసాయంపై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతో ప్రయోజనం



మునిపల్లి(అందోల్): గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని మునిపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యాపుస్తకాలతో పాటు ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలన్నారు. మంత్రి దామోదర సహకారంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి భీంసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగులో లేని భూముల గుర్తింపు

తహసీల్దార్ ఆశాజ్యోతి



మునిపల్లి(అందోల్): సాగుకు పనికిరాని భూములను గుర్తించి సంబంధిత జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు తహసీల్దార్ ఆశాజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో సాగుకు యోగ్యత లేని గుట్టలు, ఇళ్ల ప్లాట్లు, వెంచర్లు తదితర 700 ఎకరాలు భూములను గుర్తించామని తెలిపారు. సాగులో లేని భూములకు రైతుబంధు మంజూరు కాదన్నారు.

ఏఐటీయూసీలో అంగన్‌వాడీల చేరిక



నారాయణఖేడ్: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలువురు అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం ఏఐటీయూసీలో చేరారు. ఆ సంఘం జిల్లా నాయకులు చిరంజీవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల చేరికను స్వాగతిస్తున్నామన్నారు. వారి సమస్యల పరిష్కారానికి తమ సంఘం పోరాటాలకు సిద్ధంగా ఉంటుందన్నారు.

చెక్కు అందజేత

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం పోచాపూర్‌కు చెందిన బేగరి పోచయ్యకు సీఎం సహాయ నిధి నుంచి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కును మంగళవారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి తన చేతుల మీదుగా అందజేశారు. నాయకులు మోహన్‌రెడ్డి, శంకర్, నర్సింహులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పెంపు జరిగేనా?

- పారిశ్రామికవాడలో చిన్నారుల, బాలింతల సమస్యలు పట్టని అధికారులు
- పౌష్టికాహారం అందక ఇబ్బందుల్లో వలస కుటుంబాలు



తల్లికూలీ పని చేస్తుంటే డస్ట్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

పటాన్‌చెరు: నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్యను పెంచాలని చాలాకాలంగా స్థానిక ప్రజలు కోరుతున్నారు. వివిధ కారణాల వల్ల అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య పెరగడం లేదు. అంగన్‌వాడీ టీచర్లు కూడా పని ఒత్తిడికి గురవుతున్నారు. అట్టడుగు వర్గాల చిన్నారులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ఆ కుటుంబాలకు పోషకాహారం దొరకక బక్కచిక్కిపోతున్నారు. అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ ప్రాంతాల్లో కొత్త అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు అత్యవసరం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడుతున్న కూలీల పరిస్థితి దారుణంగా ఉంది. పెద్ద పెద్ద బహుళ అంతస్తులు నిర్మాణాలు చేపడుతున్న కూలీల పిల్లలు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. కార్మికులను ముఠాలుగా తీసుకువచ్చిన మేస్త్రీలు లబ్ధి పొందుతున్నారే తప్పా.. కూలీలు మాత్రం దయనీయ పరిస్థితిలో మగ్గిపోతున్నారు. వారి పిల్లల చదువులు అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వ పాఠశాలలో చిన్నారుల సంఖ్య పెరగడంతో కొత్తవారిని చేర్చుకునే పరిస్థితి లేకుండా పోయింది. నెలలు నిండిన చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంది. వారికి పోషకాహారం అందటం లేదు. కూలీలను యంత్రాలా వాడుకుంటున్నారే తప్ప వారి సంక్షేమ బాధ్యతను ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్ని సందర్భాల్లో బిల్డర్లు దయతలచి చిన్న చిన్న బహుమతులు ఇస్తున్నారు. పోషకాహారం అందించే చర్యలు తీసుకోవడం లేదు. ప్రస్తుత అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య ఉండాల్సిన దాని కంటే ఎక్కువ మంది ఉండటంతో కొత్తవారికి అవకాశం లేకుండా పోతోంది. బాలింతల పరిస్థితి అలాగే ఉంది. అమీన్‌పూర్, కొల్లూర్‌లో కొత్తగా డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో పది వేల కుటుంబాలు వచ్చి స్థిరపడ్డారు. ఈ ప్రాంతంలోని జనాభాకు అనుగుణంగా ఇప్పుడున్న కేంద్రాల కంటే రెండింతలు అధికంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో జహీరాబాద్ ఇతర నియోజకవర్గాల్లో మూడు వందల కంటే ఎక్కువే కేంద్రాలు ఉన్నాయి. కాని పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో198 అంగాన్‌వాడీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయి.

పటాన్‌చెరు సీడీపీఓ పరిధిలోని బాలింతలు, చిన్నారుల వివరాలు

పటాన్‌చెరులో మొత్తం ఎనిమిది సెక్టార్‌లో ఉన్నాయి.

2171	మొత్తం మంది గర్భిణీలు
1396	మంది బాలింతలు ఆ అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు పొందుతున్నారు.
1287	మంది ఆరునెలల చిన్నారులు.
11,706	మంది.. ఏడు నుంచి మూడేళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు పొందుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



నియోజకవర్గంతో పాటు కంది మండలం కలుపుకొని ప్రస్తుత అంగన్వాడీలకంటే ఎక్కువ కేంద్రాలు కావాలని నివేదికలను పంపాం. ఈ ప్రాంతంలో 75 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఇప్పుడు ఉన్న కేంద్రాల్లో ఉండాల్సిన సంఖ్య కంటే ఎక్కువ మంది చిన్నారులు, బాలింతలు సేవలు పొందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలో ఉండే బాలింతలు ఆ కేంద్రాలకు వెళ్లి అక్కడ సేవలు పొందవచ్చు. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లకు కూడా ఆదేశాలు జారీ చేశాం.

– జయరాంనాయక్ సీడీపీఓ, పటాన్‌చెరు

అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఆత్మీయభరోసా లబ్ధిదారుల ఎంపికను ఆయా గ్రామాల్లో చదివి వినిపించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతరం కొనసాగుతుందని వివరించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు.



న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామసభలో మాట్లాడుతున్న జానకీరెడ్డి



చేర్యాల గ్రామసభలో..



మగ్దుంపల్లి సభలో..



కల్హేర్: గ్రామసభలో ..



క్రిష్ణాపూర్‌లో..



అల్గోల్‌లో..

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ పీఎఫ్ డబ్బులు చెల్లించాలని మున్సిపల్ కార్మికులు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్(సీఐటీయూ)నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. నెలలు తరబడి మున్సిపల్ కార్మికుల పీఎఫ్ డబ్బులను జమ చేయడం లేదన్నారు. గతంలో మున్సిపల్ అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఇన్నాళ్లు ఎదురుచూశామన్నారు. వెంటనే పీఎఫ్ డబ్బులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చెల్లించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు యశోదమ్మ, సంజీవ్, పాండు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పట్టణ సీఐ సుమన్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ఆటో డ్రైవర్లకు యూనియన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. ప్రమాదాలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఓవర్ లోడుతో ప్రయాణికులను తీసుకెళ్లొద్దని చెప్పారు. రాత్రి సమయాల్లో ప్రయాణికుల నుంచి అధిక డబ్బులు వసూలు చేయడం పద్ధతి కాదన్నారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్, బీమా పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే జరిమానా తప్పదన్నారు. రహదారి ప్రమాదాల వల్ల కలిగే నష్టాలపై ఆటో డ్రైవర్లతో ప్లకార్డులు ప్రదర్శించారు.

కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: ఇటీవల బీదర్‌లో జరిగిన బ్యాంక్ దోపిడీ ఘటన నేపథ్యంలో జహీరాబాద్ పోలీసులు మంగళవారం బ్యాంక్ అధికారులు, ఏటీఎంలో నగదు నింపే ఏజెన్సీలతో స్థానిక స్టేషన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజ మనుగడ, వాణిజ్య పురోగతికి బ్యాంకింగ్ రంగం మూలస్తంభం వంటిదన్నారు. భద్రతా కోసం ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. ఏటీఎంల వద్ద భద్రత, అలారం సిస్టమ్, సీసీటీవీల ఏర్పాటు తదితర విషయాలపై పలు సూచనలు ఇచ్చారు. భద్రత కోసం కొత్త సెక్యూరిటీ పరికరాలను అమర్చాలన్నారు. అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఈ విషయంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో జహీరాబాద్ టౌన్ సీఐ.శివలింగం, టౌన్ ఎస్‌ఐ కాశీనాథ్, రూరల్ ఎస్‌ఐ ప్రసాద్, కోహిర్ ఎస్‌ఐ.సతీష్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలి

నారాయణఖేడ్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని ఫిబ్రవరి 15న ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ సచివాలయంలోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి డా.ఎ. శరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

మందుబాబులకు జైలుశిక్ష

సంగారెడ్డి క్రైమ్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలుశిక్ష విధించింది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలో సోమవారం అర్ధరాత్రి పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద, డ్రంకన్ అండ్ డ్రైవ్ నిర్వహించగా.. ముగ్గురు వాహనదారులు పట్టుపడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకిల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి మూడు రోజులు, ఇద్దరికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి రూ. 2 వేలు, 11 మందికి రూ. 1500, మరో ముగ్గురికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేయండి

- బోరపట్ల వాసుల వినతి
- వారం రోజులుగా మంచం పట్టిన గ్రామస్తులు



హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం బోరపట్ల గ్రామంలో వారం రోజుల నుంచి ఎస్సీ కాలనీవాసులు వాంతులు, వీరేచనాలతో తీవ్ర ఇబ్బందులతో మంచం పట్టారు. తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రధానంగా ఎస్సీకాలనీలోనే అనారోగ్యానికి గురైనట్లు గ్రామస్తులు వివరించారు. అయినా వైద్యాధికారులు అటు వైపు చూడకపోవడంతో వారి తీరుపై పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్



సంగారెడ్డి టౌన్: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ అన్నారు. మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు సందేశాలు తెలిపారు. కంది నుంచి మల్లేశం మాట్లాడుతూ.. సంగారెడ్డి నుంచి పటాన్‌చెరుకు ఉదయం సమయంలో బస్సుల సంఖ్యను పెంచాలని.. ఆయా ప్రాంతాలకు వెళ్లే వారికి ఆలస్యమవుతందన్నారు. పెద్ద శంకరంపేట నుంచి రామన్న మాట్లాడుతూ.. నారాయణఖేడ్‌కి పల్లెవెలుగు బస్సులను పెంచాలని కోరారు. రేగోడు నుంచి కార్తీక్ మాట్లాడుతూ.. రేగోడు నుంచి హైదరాబాద్‌కు ఉదయం సమయంలో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. వరిగుంతం నుంచి కరీముద్దీన్ మాట్లాడుతూ.. సంగారెడ్డి నుంచి వరిగుంతం మీదుగా మెదక్ బస్సులు వేయాలన్నారు. పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఉదయం, సాయంత్రం వేళలో నడిపించాలని ఫిర్యాదులు వచ్చాయని త్వరలోనే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న అంజయ్య

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

రాయికోడ్(అందోల్): రాజకీయ పార్టీకలతీతంగా సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నాగారం గొల్ల అంజయ్య స్పష్టం చేశారు. మండలంలోని హస్నాబాద్, ఔరంగానగర్ గ్రామాల్లో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ కోసం నిర్వహించిన గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి జగదీశ్‌తో కలసి పాల్గొన్నారు. పలువురి నుంచి పథకాల కోసం చేసుకున్న దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాగారం గొల్ల అంజయ్య మాట్లాడుతూ...ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు ప్రారంభించి లబ్ధిదారులకు అందిస్తారన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులను సైతం జారీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం అమలు చేస్తుందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు కొనసాగించి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జగదీశ్, ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఏవో సారిక, ఏపీవో రమేశ్, నాయకులు హస్నాబాద్ మాజీ ఎంపీటీసీ గంజి విఠల్ ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రహదారి భద్రత మనందరి బాధ్యత

పటాన్‌చెరు ఎంవీఐ విజయ్‌రావు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పటాన్‌చెరుటౌన్: రహదారి భద్రత...మనందరి బాధ్యతని పటాన్‌చెరు ఎంవీఐ విజయ్ రావు పేర్కొన్నారు. జాతీయరోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పటాన్‌చెరు మండలం ఇంద్రేశం రహదారిపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ విజయ్‌రావు మాట్లాడుతూ...వాహనాలను నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి నడపడం, అధికవేగం, రాంగ్ రూట్ వాహనాలను నడిపి ఇతరులకు ఇబ్బందులు, ప్రమాదాలు కలగజేయవద్దని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండుగలా పాత పంటల జాతర



ఎడ్ల బండ్ల ఊరేగింపులో కళాకారుల ఆటాపాట

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ గ్రామంలో పాత పంటల జాతర పండగలాలా నిర్వహించారు. డీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అల్గోల్ గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి ఎడ్ల బండ్లకు పూజలు చేశారు. అనంతరం ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. కళాకారులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా డీడీఎస్ నిర్వాహకులు చుక్కమ్మ, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సాయి ప్రియాంక, అల్గోల్ నర్సమ్మ తదితరులు మాట్లాడుతూ.. తక్కువ నీటితో పండే పాత పంటలను రైతులు సాగు చేసుకోవాలన్నారు. పెట్టుబడి కూడా తక్కువని, ఆదాయం కూడా వస్తుందన్నారు. జొన్న, కంది, కొర్ర, సామ, తైద తదితర పాత పంటలను తినడం వల్ల ఆరోగ్యం కూడా బాగుటుందన్నారు. చిరుధాన్యాలను సాగు చేసేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య, జాతర కోఆర్డినేటర్లు వినయ్‌కుమార్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వంట సామగ్రి అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రానికి గ్యాస్ స్టవ్, వంట సామగ్రిని సీజీఆర్ ట్రస్ట్ తరఫున మంగళవారం ట్రస్ట్ చైర్మన్ సిమ్ములు గోవర్ధన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, ఉదయ్ కుమార్, కరుణాకర్‌గౌడ్, సత్యనారాయణ, యాదగిరి, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

◆ విద్యాసామగ్రి వితరణ

నారాయణఖేడ్: రామచంద్రాపురం ఎంఈఓ పి.పి. రాథోడ్ ఖేడ్ మండలం అబ్బెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం సౌండ్‌బాక్స్, టెన్త్ విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులు, కంపాక్స్ బాక్సులు పంపిణీ చేశారు. పదేళ్లుగా ఏటా ఖేడ్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరీక్షల సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదివే పేదల పిల్లలకు తోచిన సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు సాయిబాబా, శ్రీనివాస్, శంకర్, శివాజీ పాల్గొన్నారు.

◆ సిద్ధివినాయకుడికి విశేష పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలం పరిధి రేజింతల్ గ్రామ శివారులోని సిద్ధి వినాయక ఆలయంలో స్వామివారికి విశిష్ట పూజలు కొనసాగుతున్నాయి. మూడవ రోజూ మంగళవారం మాదవానంద సరస్వతీ పర్యవేక్షణలో అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య లక్ష మోదకవనం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

◆ పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

జోగిపేట(అందోల్): ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతికి బీఆర్‌ఎస్ నాయకుల వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం వార్డుల వారీగా దరఖాస్తుల స్వీకరణకు నిర్వహిస్తున్న సభల్లో ప్రజలకు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఇవ్వాలని మాజీ ఎంపీపీ రామాగౌడ్ కోరారు. రేషన్ కార్డులు లేనివారికి తప్పకుండా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు డీబీ నాగభూషణం, వెంకటేశం, నాగరత్నం గౌడ్, శకీల్, పెండ గోపాల్, ఖలీల్, శంకర్, మహేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

◆ నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్



పటాన్‌చెరు టౌన్: మండలం పరిధిలోని ఇస్నాపూర్‌లో మంగళవారం ఓ యువతి శంషాబాద్ వెళ్లేందుకు ఆటోలో పటాన్‌చెరు బస్టాండ్‌కు వచ్చింది. అయితే, యువతి తన సర్టిఫికెట్లను తన వెంట తెచ్చుకున్న బ్యాగులో పెట్టి ఆటోలో మరిచిపోయింది. దీంతో ఇది గమనించిన ఆటోడ్రైవర్ బ్యాగును స్థానికంగా ఉన్న ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులకు అప్పగించాడు. దీంతో ఎస్‌ఐ శంషాబాద్‌కు చెందిన యువతి వైష్ణవికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె వచ్చి తన బ్యాగ్ తీసుకొని ట్రాఫిక్ పోలీసులు, ఆటోడ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.